క్లుప్తంగా

ఐఏడీవీఎల్ వరంగల్ చాప్టర్ అధ్యక్షుడిగా డాక్టర్ రాంచందర్



ఎంజీఎం: ఇండియన్ అసోసియేట్ డెర్మటాలజీ వెనిరియాలజీ, లెప్రసీ వరంగల్ చాప్టర్ అధ్యక్షుడిగా డాక్టర్ రాంచందర్ దరక్ ఎన్నికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో చర్మ వ్యాధులతో పాటు వెంట్రుకలకు సంబంధించిన చికిత్స విధానం – సీఎంఈ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఏడీవీఎల్‌లో వచ్చిన నూతన సాంకేతిక వైద్య విద్యపై చర్చించి, పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఈ సమావేశానికి వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు తరలిరాగా, వరంగల్ చాప్టర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా దీపక్ శోధన్ ఎన్నికయ్యారు.

పర్యావరణ పరిరక్షణకు ఎన్‌సీసీ కేడెట్ల ర్యాలీ



కాజీపేట: పర్యావరణ పరిరక్షణలో భాగంగా సెయింట్ గ్యాబ్రియల్ ఉన్నత పాఠశాల నుంచి వడ్డెపల్లి ట్యాంక్‌బండ్ వరకు ఎన్‌సీసీ కేడెట్లు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. 'పర్యావరణం కోసం నా జీవిత జీవనశైలి' కార్యక్రమంలో భాగంగా 10వ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ అజయ్, నందా కందూరి ఆదేశాల మేరకు ర్యాలీ చేపట్టగా ఎన్‌సీసీ రాయరాజ్ జెండా ఊపి ప్రారంభించారు.

కడిపికొండ భూమి మాదే



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని సర్వే నంబర్ 366లోని 32 ఎకరాల పంచరాయి భూమి తమదేనని కడిపికొండ దళితులు తెలిపారు. ఆ భూమిని తమకే కేటాయించాలని హనుమకొండ ప్రశాంత్‌నగలోని స్వగృహంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974లో కడిపికొండకు చెందిన 64 మంది దళితులకు 32 ఎకరాల భూమిని కేటాయించగా, సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఇటీవల ఆ భూమి తమదంటూ టీఎన్జీవోస్ నాయకులు సర్వే నిర్వహించేందుకు యత్నించారని వాపోయారు. కార్యక్రమంలో బస్కె రాజేందర్, బి.లక్ష్మి, రాధ, కోమల, సౌందర్య, కవిత, రజిత, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ బోనాల ఉత్సవాలు



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలో కట్ట మైసమ్మ తల్లి బోనాల పండుగను ముదిరాజ్ కులస్తులు ఆదివారం జరుపుకున్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా డప్పు, వాయిద్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి బోనాలతో చేరుకుని నైవేద్యం సమర్పించారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు సుంచు చంద్రయ్య, జక్కుల రమ, సుంచు అశోక్, డివిజన్ అధ్యక్షుడు రఘురామ్, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు కృష్ణ, శ్రీహరి తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఎంజీఎం: కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్‌లో ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారిగా పనిచేస్తూ రెండు వారాల క్రితం మృతి చెందిన వైద్యాధికారి గట్టు శ్రీనివాస్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించినట్లు అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మోహన్‌రావు, రవీందర్ ఆదివారం తెలిపారు. గట్టు శ్రీనివాస్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా అసోసియేషన్ తరఫున ప్రభుత్వానికి విన్నవిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, సరిత తదితరులు పాల్గొన్నారు.

7న శ్వేతార్కుడి నిత్య కల్యాణం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఈనెల 7న సంకటహర చతుర్థిని పురస్కరించుకుని సప్తవర్ణ అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు రాధాకృష్ణ శర్మ తెలిపారు. గణనాథుడి నిత్య కల్యాణంతో పాటు ఉత్సవమూర్తులను పుర వీధుల్లో ఊరేగించనున్నట్లు వివరించారు.

వాతావరణంలో మార్పులతో వణుకు

- భయాందోళనలో అన్నదాతలు
- కొనుగోలు కేంద్రాల వద్ద భారీగా ధాన్యం నిల్వలు
- కాంటాల కోసం రైతుల మధ్య గొడవలు
- నిలిచిపోయిన విక్రయాలు
- అధికారుల ఆదేశాలు బుట్టదాఖలు



నిలిచిపోయిన ధాన్యం విక్రయాలు



కాంటాల కోసం నిరీక్షిస్తున్న అన్నదాతలు

హసన్‌పర్తి: నాగారం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆదివారం కొట్టుకున్నారు. వడ్ల కాంటా విషయంలో రైతుల మధ్య ఏర్పడిన గొడవ కొట్లాటకు దారితీసింది. వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని గ్రహించి ముందుగా తనదంటే తన ధాన్యం కాంటా వేయాలని రైతులు గొడవకు దిగారు. ఈ సందర్భంగా పరస్పరం నెట్టేసుకున్నారు. రైతుల మధ్య గొడవ జరుగుతుండగా కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తూకం వేసే ప్రక్రియను నిలిపివేశారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా తగు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, నిబంధనల పాటించినట్లయితేనే ధాన్యం తీసుకుంటామని మిలర్లు చెబుతున్నారు.

అధికారుల ఆదేశాలు బుట్టదాఖలు

రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఓ వైపు అధికారులు ఆదేశిస్తున్నా, మరో వైపు మిల్లర్ల నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. ఈక్రమంలో అధికారులు జారీ చేసినా ఆదేశాలు బుట్టదాఖలవుతున్నాయి. బస్తాకు నాలుగు కిలోల చొప్పున కోత విధిస్తున్నారని రైతులు వాపోతున్నారు. తరుగు వద్దనుకుంటే ధాన్యం తీసుకోబోమని మిల్లర్లు తెగేసి చెబుతున్నారని తెలిపారు. అలాగే, గన్నీ సంచులు, లారీల కొరత తీవ్రంగా ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

4కిలోలు కోత విధిస్తున్నారు



నాణ్యతా లేదంటూ ధాన్యంలో తరుగు తీస్తున్నారు. 550 బస్తాలను కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లి, అక్కడి నుంచి కస్టమ్ మిల్లింగ్‌కు పంపారు. బస్తాకు నాలుగు కిలోలు తరుగు తీస్తా అని మిల్లు యజమాని అంటున్నాడు. నాలుగు కిలోలు చొప్పున తరుగు తీస్తే సుమారు రూ.40వేలు అదనంగా నష్టపోవాల్సి వస్తోంది.

– బండారి సాంబయ్య, మాజీ ఉపసర్పంచ్

కాంటా వేస్తలేరు



రెండు రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చా. ఇప్పటి వరకు కాంటా వేయలేదు. వర్షం వస్తే ధాన్యం తడిపోతుంది. ఆరుగాలం రెక్కల కష్టం నీటిపాలవుతుంది. ఉన్నత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– తిరుపతిరెడ్డి, రైతు

సంచులు లేవు



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చినా. ఇక్కడ సంచులు లేవు. దాంతో కొనుగోలు కేంద్రం వద్దనే ఆరబోశా. సంచులు ఇస్తే ధాన్యం నింపి కాంటా వేయడానికి తీసుకెళ్తా.

– రావుల మొగిలి, రైతు

మాల కులస్తుల అభివృద్ధికి కేసీఆర్ కృషి



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

కాజీపేట అర్బన్: మాల కులస్తుల అభివృద్ధికి సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేటలో ఆదివారం భీమ్ మాల పరస్పర సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ హాజరై మాట్లాడారు. మాల సంఘ భవన నిర్మాణానికి స్థల సేకరణలో వెంకటమల్లు పాత్ర మరువలేనిదని కొనియాడారు. భీమ్ మాల పరపతి సంఘం సభ్యత్వం వెయ్యికి చేరుకున్న తరుణంలో తనవంతు సాయం అందజేస్తానని అన్నారు. కార్యక్రమంలో రైతురుణ విముక్తి కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆరెపల్లిలో బడిబాట



బడిబాటలో ఉపాధ్యాయులు

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆరెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలమల్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు విద్యార్థులు పాఠశాలలో చేరినట్లు వరంగల్ ఎంఈఓ విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని యాదవ నగర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యత, పాఠశాలలకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సౌకర్యాలను వివరించారు.స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రఘునాయక్, సీఆర్పీ మంజుల పాల్గొన్నారు.

20న గిరిజనుల 'చలో హైదరాబాద్'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: గిరిజన రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఈనెల 20వ తేదీన గిరిజన ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కువద్ద మహా ధర్నా చేపట్టనున్నట్లు లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోత్ కిషన్ నాయక్ తెలిపారు. పబ్లిక్‌గార్డెన్‌లో మహాధర్నా కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల అధ్యక్షులు అజ్మీరా వెంకట్, బానోత్ సునీల్ నాయక్, బానోత్ వసంత్, భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాల ఇన్‌చార్జ్‌లు అజ్మీరా పూల్‌సింగ్, జాటోత్ బాలు, అజ్మీరా పడినాయక్ పాల్గొన్నారు.

నేడు పీఆర్‌టీయూ ప్రతిభా పురస్కారాల అందజేత

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్, కేజీబీవీపీ, మోడల్ స్కూళ్లలో టెన్త్ పరీక్షల ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులు, మండల టాపర్లు, 100శాతం ఉత్తీర్ణత సాధించిన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూటీఎస్ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను ఈనెల 5న అందజేయనున్నట్లు ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూటీఎస్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి ఆదివారం తెలిపారు. ఈనెల 5న ఉదయం హనుమకొండలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 22ఉన్నత పాఠశాలల్లో టెన్త్‌లో 100శాతం ఫలితాలు వచ్చాయని, 10జీపీఏ, మండల టాపర్లు కలిపి 37మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు విరించారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఖిలా వరంగల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటి ఆశలు, ఆకాంక్షలతో విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, సకల జనులు, తెలంగాణ కోసం ఉద్యమించారని గుర్తుచేశారు. తమ ఉద్యోగాలు తమకే వస్తాయని, నేటికీ వారి కలలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితహక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 16, 17, 18 తేదీల్లో రాష్ట్ర స్థాయి రాజకీయ విజ్ఞాన శిక్షణ సదస్సులు వరంగల్ నగరంలో జరగనున్నాయని వివరించారు. సమావేశంలో ఎలెందర్, రాజు, రాజేందర్, శ్రీనివాస్, దేవరాజు, ఆరోగ్యం పాల్గొన్నారు.

రేపు కేయూలో కాంట్రాక్టు లెక్చరర్ల సదస్సు



లింగమూర్తిని కలిసిన సంఘం బాధ్యులు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్యాకేంద్రంలోని జాఫర్ నిజాం సెమినార్‌హాల్‌లో కాంట్రాక్టు లెక్చరర్ల సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ తెలిపారు. సదస్సుకు కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్.లింగమూర్తి, శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ మహ్మద్ ఇక్బాల్‌అలీ హాజరవుతారని తెలిపారు. ఈమేరకు హనుమకొండలో లింగమూర్తిని ఆదివారం కలిసి సదస్సును విజయవంతం చేయాలని కోరినట్లు తెలిపారు.

ఆశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

హసన్‌పర్తి: అనాథలకు సేవ.. దేవుడి సేవతో సమానమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆర్య వైశ్య సంఘం జిల్లా నాయకుడు చకిలం చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను భీమారంలోని లార్డ్ అనాథాశ్రమంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. అభాగ్యులకు దాతలు సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, తోట నాగరాజు, కత్తెరశాల ప్రశాంత్, చకిలం సునీత, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పద్మశాలి సంఘం ఎన్నికలు టై

హసన్‌పర్తి: పద్మశాలి సేవా సంఘం హసన్‌పర్తి శాఖ ఎన్నికలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. అధ్యక్ష పదవికి గూడూరు లక్ష్మీనారాయణ (గురువు), కేదాసి రాకేష్ (శిష్యుడు) పోటీ పడ్డారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 512 ఓట్లు ఉండగా, 446 ఓట్లు పోలయ్యాయి. లక్ష్మీనారాయణ, రాకేష్ ఇద్దరికీ 223 చొప్పున ఓట్లు వచ్చాయి. ఓట్లు సమంగా రావడంతో టాస్‌తో ఫలితాలు ప్రకటించాలని ఎన్నికల ఇన్‌చార్జ్‌లు నల్ల సత్యనారాయ, చెన్నూరి కిరణ్, మాటేటి భాస్కర్ నిర్ణయించగా, అభ్యర్థులు నిరాకరించారు. కుల పెద్దలతో చర్చించి వారం తర్వాత నిర్ణయం వెల్లడిస్తామని ఇన్‌చార్జ్‌లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

వరంగల్: పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీబారాణి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డివిజన్‌లోని పైడిపల్లి, కొత్తపేట, ఆరెపల్లి అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో కిశోర బాలికలు, బాలురలకు చిరుధాన్యాలు, హెల్త్ అండ్ న్యూట్రిషన్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పైడిపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఎ.రమాదేవి, టీచర్లు బేబినిర్మల, కనకలక్ష్మి, సునీత, భాగ్యమ్మ, వసంత, శ్రీకళ, శోభ, రమ, సుజాత, ధనమ్మ, రత్నవేణి తదితరులు పాల్గొన్నారు.

రజకులకు 'రజక బంధు' ప్రకటించాలి



మడికొండ: దళిత బంధులాగా రజకులకు రజకబంధు పథకాన్ని ప్రభుత్వం ప్రకటించాలని ఈస్ట్ జోన్ బీఆర్‌ఎస్ పార్టీ కన్వీనర్ నార్లగిరి చిన్న కుమారస్వామి డిమాండ్ చేశారు. కాజీపేట మండలం మడికొండలో ఆదివారం ఏర్పాటు చేసిన రజక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజకులకు రజకబంధుతో పాటు ప్రమాద బీమా కూడా వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నార్లగిరి రమేష్, భిక్షపతి, నార్లగిరి రాజయ్య, గంగారపు శ్రీధర్, కుమార్, ఖమ్మం రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'మేకాల్' వేడుకలు

ఖిలా వరంగల్: ధ్యాన యోగాతో బ్రహ్మత్వం పొందడమే మాస్టర్ సీవీవీ సంకల్పమని యోగా గురువు దామరాజు వెంకట హనుమంతరావు అన్నారు. వరంగల్ శివనగర్‌లోని మాస్టర్ సీవీవీ యోగా క్షేత్రంలో గత నెల 30న ప్రారంభమైన మేకాల్ వేడుకలు ఆదివారం రాత్రి ముగిశాయి.

వెయిట్ లిఫ్టర్ కృష్ణమూర్తికి అభినందన

కాజీపేట: ఇటీవల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాజీపేట పట్టణంలో బంగారు పతకం సాధించిన మండలోజు కృష్ణమూర్తిని ఎవర్ గ్రీన్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సాయంత్రం సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఉండి నాసీర్ ఆధ్వర్యంలో కృష్ణమూర్తికి సభ్యులు శాలువా కప్పి ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో మామిడాల రాజేంద్రం, ఆదాం, రామేశ్వరాచారి, కుమారస్వామి, నర్సయ్య, ఎండీ.ఖాదీర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

రైతుబంధు కోఆర్డినేటర్ శ్రీనివాస్‌కు సన్మానం

వరంగల్: వరంగల్ మండల రైతుబంధు కోఆర్డినేటర్‌గా నియమితులైన ఆరెపల్లికి చెందిన బుద్ధ శ్రీనివాస్‌ను పలువురు నాయకులు సోమవారం సన్మానించారు. స్థానిక కార్పొరేటర్ షీబారాణి, బీఆర్‌ఎస్ నాయకులు అనిల్, బుద్ధ వెంకన్న, హరికృష్ణ, నేరెళ్ల రాజు అభినందించారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి



మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కృషి చేస్తున్నారని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ స్నేహనగర్‌లో సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇమ్మడి రాజు, జన్ను విజయలక్ష్మి, స్నేహనగర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి



బాలుకు నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

హన్మకొండ: గాన గంధర్వుడు, పద్మశ్రీ, పద్మ విభూషన్ అవార్డు గ్రహీత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతిని హనుమకొండ హనుమాన్‌నగర్ –1లో ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలు చిత్రపటానికి కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మొట్ల మనోహర్, సాధుల రఘుపతి, కుమార్ రెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేష్, రవికిరణ్, అశోక్, బషీర్, గణేష్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలతోనే సమాజంలో ప్రశాంతత



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్

మామునూరు: పోలీస్ వ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని, పోలీసుల పటిష్టత, శాంతి భద్రతలతోనే నేడు గ్రామాలు, పట్టణాల్లో ప్రశాంతత నెలకొందని మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. తెలంగాణ అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఖిలా వరంగల్ మండలం మామునూరు, తిమ్మాపురం, అల్లీపురం గ్రామాల్లో ఎస్సై కృష్ణవేణి ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై రాకేష్‌రెడ్డి, కార్పొరేటర్ అరుణవిక్టరి, నాయకులు జలగం రంజిత్, పోశాల సదానందం, జోగిరెడ్డి పాల్గొన్నారు.

పోచమ్మమైదాన్‌లో సురక్షా దినోత్సవం

రామన్నపేట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ వేడుకలను పురస్కరించుకుని నగరంలోని 22వ డివిజన్ ఇన్నర్ వీల్ ఫంక్షన్ హాల్‌లో పోలీసు సురక్షా దినోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ బోనాల కిషన్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం తీసుకొచ్చి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమార్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సైలు నవీన్, సాయిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బొమ్మల కట్టయ్య జీవితం ఆదర్శం



బౌద్ధ వందనం చేస్తున్న అతిథులు

హన్మకొండ: దళితరత్న బొమ్మల కట్టయ్య జీవితం ఆదర్శమని ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం, భారతీయ బౌద్ధ సభ ఆధ్వర్యంలో హనుమకొండలోని జెడ్పీ సమావేశం మందిరంలో బొమ్మల కట్టయ్య యాదిసభ ఆదివారం జరిగింది. ముందుగా కట్టయ్య చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించి బౌద్ధ వందనం చేశారు. అనంతరం ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ అట్టడుగుల వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా బొమ్మల కట్టయ్య పోరాడారని గుర్తుచేశారు. రౌతు రమేష్‌కుమార్, కుమారస్వామి, అంబేడ్కర్, ఎల్లయ్య, ఎస్.వేదాంత, శ్రీనివాస్, ఎం.సారంగపాణి, డాక్టర్ వెంకటి, రవీందర్, రాములు పాల్గొన్నారు.

కేంద్రం సబ్సిడీతోనే రాష్ట్రానికి పరిశ్రమలు



సమావేశంలో మాట్లాడుతున్న వివేక్

కాశిబుగ్గ: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలతోనే తెలంగాణకు పరిశ్రమలు వస్తున్నాయని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి అన్నారు. ఓసిటీలోని బీజేపీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివేక్ మాట్లాడారు. దేశంలోనే ఎక్కువ రైతు ఆత్మహత్యలు తెలంగాణలోనే జరుగుతున్నాయని, అందుకు కారణం సీఎం కేసీఆర్ పాలనే అని ఆరోపించారు. ఒకవైపు రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా.. మరో వైపు దశాబ్ది ఉత్సవాల పేరిట నాయకులు పెద్దమొత్తంలో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ హంగామా చేస్తున్నారని అన్నారు. సమావేశంలో బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు కొండేటి శ్రీధర్, రావు పద్మ, బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మురళీధర్‌రావు, డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా: పదవ తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులను ఆర్యవైశ్య మిత్ర మండలి ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్ పాత బీటు బజారులోని మేదరివాడలోని ఆర్యవైశ్య మిత్ర బృందం కార్యాలయంలో సోమవారం సత్కరించి, ప్రశంస పత్రాలు పంపిణీ చేసి, మెడల్స్ అందజేశారు. అలాగే, ఉచిత కంప్యూటర్ శిక్షణ తీసుకున్న 60మందికి పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్ర బృందం జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్, నాయకులు పళ్ల పరమేశ్వర్, యాద రవికుమార్, చిన్నాల సురేష్, రవిబాబు, అల్లాడి వీరభద్రయ్య, పాల సత్యనారాయణ, శ్రీరామ్ శ్రీనివాస్, సోమ అశోక్, రేపాలహరి, సందీప్, హరిణి, లిఖిత, అంజలి, యాద రజిత, రవికుమార్, కృష్ణమూర్తి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న సుష్మితా పటేల్

రామన్నపేట: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కాంగ్రెస్ నాయకులు కొండా మురళీధర్‌రావు, కొండా సుస్మితాపటేల్ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన యువత కోసం కాంగ్రెస్ అనే కార్యక్రమంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో చిట్టక్క (సుస్మితాపటేల్) గ్రూపు కొండా సురేఖ గెలుపు కోసం పనిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు కొండా సురేఖ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.